సాహితీ ఇన్‌ఫ్రా అధినేత

ఈడీ కస్టడీపై ముగిసిన వాదనలు

తీర్పును రిజర్వు చేసిన కోర్టు

నాంపల్లి కోర్టులు, అక్టోబర్ 4(నమస్తే తెలంగాణ): సాహితీ ఇన్‌ఫ్రా మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ ఈడీ కస్టడీపై శుక్రవారం ఈడీ కోర్టులో వాదనలు ముగిశాయి. సీసీఎస్ పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ నిర్వహించారని, దర్యాప్తు నేపథ్యంలో రూ.200 కోట్ల సాహితీ ఇన్‌ఫ్రా ఆస్తులను కూడా జప్తు చేశారని నిందితుడి తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. రూ.1500 కోట్లు వసూలు చేసి బోర్డు తిప్పేశారని బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి విచారణను సైతం అధికారులు పూర్తి చేశారన్నారు. ప్రస్తుతం ఈడీ కస్టడీకి అప్పగించాల్సిన అవసరం లేదని, సంబంధిత ద్రువపత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారని వివరించారు. కోట్లల్లో మోసం జరగడంతో ఈడీ రంగంలోకి దిగిందని, డబ్బులకు సంబంధించిన మోసాల గురించి మాత్రమే ఈడీ విచారణ చేపడుతుందని ఈడీ తరపు న్యాయవాది తెలిపారు. రూ.1500 కోట్ల వసూళ్ల గురించి జరిగిన మోసాన్ని విచారించేందుకు ఈడీ కస్టడీకి ఇవ్వాలని కోర్టును కోరారు. డబ్బుల లావాదేవీల గురించి మాత్రమే ఈడీ విచారిస్తుందన్నారు. దాదాపు 3000 మంది బాధితులు మోసపోయారని, ఇప్పటికే ఈ సంస్థపై 50కి పైగా కేసులు నమోదయ్యాయని నిందితుడి తరపు న్యాయవాది వివరించినప్పటికీ ఆ కేసులతో ఈడీకి సంబంధం లేదని ఈడీ స్పష్టం చేసింది. లావాదేవీల్లో పాల్గొన్న ఇతర డైరెక్టర్లతో పాటు చేతులు మారిన కీలక వ్యక్తుల వివరాలను సేకరించాల్సి ఉన్నదని ఈడీ తెలిపింది. ఈడీ కార్యాలయంలో చేపట్టిన విచారణకు నిందితుడు పూర్తి స్థాయిలో సహకరించలేదన్నారు. సంస్థ కార్యాలయంలో సోదాలు నిర్వహించి స్వాధీనం చేసుకున్న డాక్యుమెంట్ల, కీలక పత్రాల గురించి నిందితుడి ద్వారా వివరాలను తెలుసుకోవాల్సి ఉన్నదన్నారు. నిందితుడి నుంచి సమాచార సేకరణకు 14 రోజుల కస్టడీ కోసం పిటిషన్ దాఖలు చేసినప్పటికీ 10 రోజుల ఈడీ కస్టడీకి అప్పగించాలని న్యాయవాది వాదనలు వినిపించారు. ఇరువర్గాలకు చెందిన వాదనలు విన్న కోర్టు.. తీర్పును 7కు రిజర్వ్ చేస్తూ జడ్జి సురేశ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈడీ అధికారులు కోర్టు ఎదుట హాజరయ్యారు.

బాలిక న్యూడ్ వీడియో రికార్డు చేసి..
సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన కామాంధుడు

బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు

వెంగళరావునగర్, అక్టోబర్ 4: మాయ మాటలతో నమ్మించి.. బాలిక న్యూడ్ వీడియో ఫోన్‌కాల్‌ను రికార్డ్ చేసిన ఓ యువకుడు.. సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. ఈ ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మధురానగర్ పరిధిలో నివాసముండే బాలిక (16) ఫోన్ నంబర్‌ను ఆమె స్నేహితురాలి ద్వారా లోకేశ్(18) తీసుకున్నాడు. ఆ బాలికకు ఫోన్‌చేసి పరిచయం పెంచుకున్నాడు. బాలికను భయపెట్టి ఆమెకు న్యూడ్ వీడియో కాల్ చేసి, రికార్డ్ చేశాడు. కొద్ది రోజుల కిందట అతడి దుష్ప్రవర్తనకు విసుగు చెందిన బాలిక.. ఫోన్ నంబర్‌ను మార్చేసింది. దీంతో ఆమెపై కక్ష గట్టాడు. యువకుడి వేధింపులు పెరగడంతో తనకు ఇక చావే శరణ్యమనుకుంది. హుస్సేన్‌సాగర్‌లో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నిస్తూ.. తన సోదరుడికి ఫోన్‌చేసి తాను చనిపోతున్నానని చెప్పింది. సోదరుడు ఇచ్చిన ఓదార్పుతో ఆత్మహత్యాయత్నాన్ని విరమించుకుంది. ఈ ఘటనపై బాలిక మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాంపల్లి కోర్టులో డిజిటైజేషన్ సెంటర్

ప్రారంభించిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ ఆరాధే

నాంపల్లి కోర్టులు, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): నాంపల్లి కోర్టుల్లో కంప్యూటర్ వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు ఏర్పాటు చేసిన డిజిటైజేషన్ సెంటర్‌ను తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ ఆరాధే, జస్టిస్ సుజయ్‌పాల్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించిన అనంతరం డిజిటైజేషన్ సెంటర్ పలకం ఆవిష్కరించారు. నాంపల్లి కోర్టుల ఇన్‌చార్జి, జిల్లా జడ్జి సురేశ్.. జస్టిస్ ఆరాధేకు పుష్పగుచ్ఛాన్ని అందించి స్వాగతం పలికారు. అదే విధంగా.. జస్టిస్ సుజయ్ పాల్‌ను కూడా పుష్పగుచ్ఛంతో సత్కరించారు. నాంపల్లి కోర్టుల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజ్యవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు గోకుల్, ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్, సభ్యులు, నాంపల్లి కోర్టులోని అన్ని కోర్టుల మెజిస్ట్రేట్లు, జిల్లా జడ్జీలు, సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.

నాంపల్లి కోర్టులో డిజిటైజేషన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాధే, జస్టిస్ సుజయ్‌పాల్

యజమానికి టోకరా

ఉద్యోగి సహా అతడి స్నేహితుడి అరెస్ట్

సిటీబ్యూరో, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): యజమానికి టోకరా వేసి రూ. 30 లక్షలతో పరారైన గోల్డ్ రిఫైనరీ ఉద్యోగితో పాటు అతడికి సహకరించిన స్నేహితుడిని నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ సుధీంద్ర కథనం ప్రకారం..

మహారాష్ట్రకు చెందిన రోహన్ కదమ్ నాలుగు రోజుల కిందట సికింద్రాబాద్ పాట్ మార్కెట్‌లోని జ్యోతిర్లింగ రిఫైనింగ్ దుకాణంలో పని కోసం చేరాడు. గురువారం దుకాణం యజమాని 400 గ్రాముల బంగారం ఇచ్చి.. దానిని సికింద్రాబాద్‌లోని ఎస్ఎం జ్యువెల్లరీలో అందజేసి, అక్కడ ఇచ్చే నగదు తీసుకొని రావాలని సూచించాడు. ఈ క్రమంలో బంగారాన్ని ఎస్.ఎం.జ్యువెల్లరీలో ఇచ్చి.. రూ. 30 లక్షల నగదు తీసుకున్న రోహన్ కదమ్.. తన ముందస్తు ప్లాన్‌లో భాగంగా స్నేహితుడు ముజమిల్ బలిగర్, పృథ్వీరాజ్ సాలంకి, ప్రసాద్‌తో కలిసి కారులో బెంగళూరు వెళ్లిపోయారు. బంగారంతో వెళ్లిన రోహన్ కదమ్ తిరిగి రాకపోవడంతో.. దుకాణం యజమాని ఎస్ఎం జ్యువెల్ల రీకి ఫోన్ చేయగా.. చాలా సేపటి కిందటే బంగారం ఇచ్చి.. నగదు తీసుకెళ్లినట్టు చెప్పారు. పక్క ప్లాన్‌తోనే డబ్బును ఎత్తుకెళ్లినట్టు గుర్తించిన యజమాని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. నార్త్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సైదులు నేతృత్వంలోని ఓ బృందం రంగంలోకి దిగి.. రోహన్ కదమ్, ముజమిల్‌ను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 29,92,000 నగదు, కారు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మిగతా ఇద్దరు కోసం గాలిస్తున్నారు.

జనావాసాల మధ్య పటాకుల గోదాం.. టాస్క్‌ఫోర్స్ దాడి

నిర్వాహకుడి అరెస్ట్..

రూ. 15 లక్షల విలువైన క్రాకర్స్ సీజ్

సిటీబ్యూరో, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): జనావాసాల మధ్య బేగంబజార్‌లో అక్రమంగా టపాసుల గోదాంను నిర్వహిస్తున్న శ్యాం యాదవ్ ఖేర్య వాలెను అరెస్ట్ చేసి, రూ.15 లక్షల విలువైన క్రాకర్స్‌ను సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ సుధీంద్ర కథనం ప్రకారం.. దసరా, దీపావళి పండుగల సందర్భంగా క్రాకర్స్‌కు మంచి గిరాకీ ఉంటుంది. దీంతో ముందస్తుగానే బేగంబజార్‌కు చెందిన శ్యాం యాదవ్ భారీ ఎత్తున పటాకులు తెచ్చి ఫీల్కానాలో నివాసాల మధ్య ఓ ఇంటిని అద్దెకు తీసుకొని.. అందులో నిల్వ చేశాడు. విశ్వసనీయ సమాచారం మేరకు.. సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ నేతృత్వంలోని బృందం ఈ గోదాంపై దాడి చేసి పట్టుకున్నారు.

బైక్ దొంగతనాలు చేస్తున్న మాజీ హోంగార్డు అరెస్టు

అడ్డగుట్ట, అక్టోబర్ 4: జల్సాలకు అలవాటు పడి.. వరుసగా బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని చిలకలగూడ పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. చిలకలగూడ పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈస్ట్‌జోన్ అడిషనల్ డీసీపీ నర్సయ్య వివరాలు వెల్లడించారు. బోయిగూడ ప్రాంతానికి చెందిన అబ్రహం జానీ (48) 1996లో హోంగార్డుగా విధుల్లో చేరాడు. ఉద్యోగంలో చేరే సమయంలో అతడు నకిలీ పత్రాలు ఇవ్వడంతో 2015లో పోలీస్ శాఖ నుంచి తొలగించారు. ఆ తర్వాత మారుతీ సర్వీసింగ్ సెంటర్, నిక్సా సర్వీసింగ్ సెంటర్‌లో సుమారు ఏడేండ్ల పాటు పనిచేశాడు. పలు కారణాలతో ఉద్యోగాల నుంచి తొలగించడంతో.. అప్పటి నుంచి మద్యం, గంజాయికి బానిసయ్యాడు. సులువుగా డబ్బులు సంపాదించేందుకు ఆస్పత్రులు, మద్యం దుకాణాలను లక్ష్యంగా చేసుకున్నాడు. అక్కడ పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలను దొంగిలించడం ప్రారంభించాడు. దొంగిలించిన వాహనాలను పార్శిగుట్ట ప్రాంతానికి చెందిన ఆంజనేయులుకు విక్రయించాడు. అయితే, గాంధీ ఆస్పత్రి నుంచి అధికంగా ఫిర్యాదులు రావడంతో.. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. అబ్రహం, ఆంజనేయులును అరెస్టు చేసి, రూ.5 లక్షల విలువ చేసే 8 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.

మహిళ లతో అసభ్యంగా ప్రవర్తించిన 200 మందికి జైలు

796 మందికి కుటుంబసభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్

సిటీబ్యూరో, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): నగరంలో మహిళలతో అసభ్యంగా ప్రవర్తించే వారికి చోటు లేదని, బాధితులు ధైర్యంగా షీ టీమ్స్‌కు ఫిర్యాదు చేయాలని సిటీ మహిళా భద్రత డీసీపీ దార కవిత సూచించారు. ఇటీవల గణేశ్ నిమజ్జనం సందర్భంగా ఖైరతాబాద్‌లోని బడా గణేశ్, ఇతర రద్దీగా ఉండే గణేశ్ మండపాలు, నిమజ్జనం సమయంలో మహిళలతో అసభ్యంగా ప్రవర్తించిన 996 మందిని షీ టీమ్స్ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నది. ఇందులో 200 మందికి మూడు రోజుల జైలు శిక్ష, ఒక్కొక్కరికీ రూ. 1050 జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు చెప్పిందని ఒక ప్రకటనలో వివరించారు. మిగతా వారికి వారి కుటుంబసభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించినట్టు తెలిపారు.

సిటీలో క్లెయిమ్ చేయని వాహనాల వేలం

అభ్యంతరాలుంటే ఆరు నెలల్లో దరఖాస్తు చేసుకోండి

హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్

సిటీబ్యూరో, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): వివిధ కారణాలతో పోలీసులు స్వాధీనం చేసుకున్న, గుర్తుతెలియని వ్యక్తులు రోడ్లపై వదిలేసిన 1212 వాహనాలను ఇంతవరకు ఎవరూ క్లెయిమ్ చేయలేదని, వాటిని అండర్ సెక్షన్ 7 హైదరాబాద్ (మెట్రోపాలిటన్ ఏరియా) పోలీస్ యాక్ట్ 2004, రెడ్ విత్ 40 హైదరాబాద్ సిటీ పోలీస్ యాక్ట్ ప్రకారం వేలం వేస్తామని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ప్రకటించారు. ఈ వాహనాలలో ఏదైనా అభ్యంతరమున్నా, యాజమాన్య, హైపోథికేషన్ హక్కులకు సంబంధించిన డాక్యుమెంట్లతో ఈ ప్రకటన వెలువడిన ఆరు నెలల్లోపు బంజారాహిల్స్‌లోని నగర పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో దరఖాస్తు చేసి, తమ వాహనాలను క్లెయిమ్ చేసుకోవచ్చని సూచించారు. ఆరు నెలల్లో ఎవరూ క్లెయిమ్ చేయకపోతే.. ఆయా వాహనాలను వేలం వేస్తామన్నారు. ఈ వాహనాల వివరాలు గోషామహల్‌లోని శివకుమార్ లాల్ పోలీస్ స్టేడియం ఆఫీస్‌లో, హైదరాబాద్ సిటీ పోలీస్ అధికారిక వెబ్‌సైట్(www.hyderabadpolice.gov.in) లోనూ అందుబాటులో ఉంటాయని సీపీ సూచించారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో నష్టం.. యువకుడి ఆత్మహత్య

కుమారుడి మృతితో తల్లి ఆత్మహత్యాయత్నం

హయత్‌నగర్, అక్టోబర్ 4: ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో నష్టం రావడంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుమారుడు మృతి చెందాడన్న వార్తతో తల్లి కూడా ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ హృదయ విదారక ఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని సూర్యానగర్ కాలనీలో తాటికొండ అఖిల్‌రెడ్డి (24) తన తల్లి లూర్దమ్మతో కలిసి ఉంటున్నాడు. అఖిల్‌రెడ్డి బీటెక్ పూర్తి చేశాడు. తల్లి లూర్దమ్మ సంగారెడ్డి జిల్లా సదాశివపేట మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నది. తండ్రి శ్రీనివాస్‌రెడ్డి వృత్తిరీత్యా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ భార్య, కుమారుడికి దూరంగా ఉంటున్నాడు. అఖిల్‌రెడ్డి ఆన్‌లైన్ ట్రేడింగ్ షేర్ మార్కెట్‌లో దాదాపు రూ.25 లక్షల వరకు పోగొట్టుకున్నాడు. దీంతో మనస్తాపానికి గురైన అఖిల్‌రెడ్డి గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉన్న ఒక్క కుమారుడు అఖిల్‌రెడ్డి మృతి చెందాడని తెలిసిన తల్లి లూర్దమ్మ.. తీవ్ర మనోవేదనకు గురైంది. ఇంటిలోని బాత్‌రూమ్ క్లీన్ చేసే యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే ఆమెను గమనించిన స్థానికులు, బంధువులు చికిత్స నిమిత్తం హయత్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉన్నట్టు వైద్యులు వెల్లడించారు. అఖిల్‌రెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఒకే ఇంట్లో రెండు ఘటనలు చోటు చేసుకోవడంతో బంధువుల రోదనలు మిన్నంటాయి.

గ్రేటర్‌లో దంచికొట్టిన వాన

మెహిదీపట్నంలో అత్యధికంగా 5సెం.మీ. వర్షపాతం నమోదు

రాగల మరో రెండు రోజులు వర్ష సూచన

ఎల్లో అలర్ట్ జారీచేసిన అధికారులు

సిటీబ్యూరో, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో ఏర్పడిన ఆవర్తనం ప్రభావంతో శుక్రవారం గ్రేటర్‌లో సాయంత్రం వాన దంచికొట్టింది. రాత్రి 10గంటల వరకు నగరంలోని మెహిదీపట్నంలో అత్యధికంగా 5.0సెం.మీ, కాంచన్‌బాగ్‌లో 4.8సెం.మీ, ఆసిఫ్‌నగర్‌లో 4.6సెం.మీ, కందికల్‌గేట్‌లో 3.9సెం.మీ, లంగర్‌హౌస్‌లో 3.6సెం.మీ, బార్కాస్, చాంద్రాయణగుట్టలో 3.0సెం.మీ. చొప్పున వర్షపాతం నమోదైనట్లు టీజీడీపీఎస్ అధికారులు వెల్లడించారు. కాగా, ఆవర్తనం కొనసాగుతుండడంతో దాని ప్రభావం వల్ల రాగల మరో రెండు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల మోస్తరు నుంచి భారీ వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఇదిలా ఉండగా.. నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 32.8డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 23.3డిగ్రీలు, గాలిలో తేమ 68శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

నగరంలో ట్రాఫిక్ నరకయాతన

6నుంచి 8గంటల పాటు స్తంభించిన ట్రాఫిక్

సిటీబ్యూరో, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): నగరంలో మరోసారి ట్రాఫిక్ నరకాన్ని చూపించింది. ఒకటి కాదు రెండు కాదు 6 నుంచి 8గంటల పాటు ఎక్కడికక్కడ ట్రాఫిక్ స్తంభించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. టోలీచౌకి నుంచి మెహిదీపట్నం వైపు, మెహిదీపట్నం నుంచి గుడిమల్కాపూర్, కార్వాన్, రింగ్‌రోడ్, లంగర్‌హౌస్, బాపూఘాట్ వైపు, అత్తాపూర్ నుంచి హైదర్‌గూడ, ఉప్పర్‌పల్లి, శివరాంపల్లి చౌరస్తా, ఆరాంఘర్ చౌరస్తా వరకు ఎక్కడి వాహనాలు అక్కడ నిలిచిపోయాయి. వర్షం తగ్గిన కొన్ని గంటల వరకు కూడా ట్రాఫిక్ అదుపులోకి రాలేదు. ట్రాఫిక్ నిలిచిపోయి దాదాపు నాలుగైదు గంటలైనా ట్రాఫిక్ పోలీసుల జాడ కనిపించకపోవడంపై వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చలాన్‌ల వసూళ్లపై చూపించే శ్రద్ధ ట్రాఫిక్ నియంత్రణపై కూడా చూపిస్తే బాగుంటుందని హైదరాబాద్, సైబరాబాద్ పోలీసులపై ప్రజలు తీవ్రంగా మండిపడ్డారు. రోడ్లపై ఐదారు గంటల పాటు నిరీక్షించడంతో అటు సమయం వృథా కావడమే కాకుండా పొగ కాలుష్యంతో ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. చాలా మంది వాహనదారులు పలు రకాలుగా పోలీసులకు సమాచారం అందించినా పరిస్థితిలో మార్పు కనిపించలేదు. సాయంత్రం 5 నుంచి రాత్రి 11గంటల వరకు కూడా సమస్య తీరకపోవడంతో వాహనదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

హైటెక్ సిటీలో ట్రాఫిక్ ఇక్కట్లు తొలగింపు!

జల మండలి, జీహెచ్ఎంసీ, పోలీస్ శాఖల సంయుక్త కార్యాచరణ

సిటీబ్యూరో: హైటెక్ సిటీ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇక్కట్లు తొలగించేందుకు మూడు శాఖల ఆధ్వర్యంలో సంయుక్త కార్యాచరణ చేపట్టారు. మాదాపూర్, హైటెక్ సిటీ ప్రాంత నివాసులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ జాం సమస్యను పరిష్కరించేందుకు జీహెచ్ఎంసీ, జల మండలి, పోలీస్ శాఖలు కలిసి ట్రిడెంట్ హోటల్ నుంచి యశోద ఆసుపత్రి వరకు ఐదు కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ పనులు చేపట్టనున్నారు. జల మండలి ఎండీ అశోక్ రెడ్డి, సైబరాబాద్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్, జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి కలిసి శుక్రవారం పర్యటించారు. లెమన్ ట్రీ హోటల్ నుంచి ట్రిడెంట్ హోటల్ వరకు రోడ్డు విస్తరణ చేపట్టనున్న నేపథ్యంలో అక్కడున్న ఎయిర్ వాల్వ్‌లను సమీపానికి తరలించడానికి జాయింట్ సీపీతో చర్చించారు. మాదాపూర్ యశోద ఆసుపత్రి వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనుల్లో ధ్వంసమైన సీవరేజ్ పైపులైన్లను పరిశీలించారు. వాటిని సాధ్యమైనంత త్వరగా పునరుద్ధరిస్తామని ఎండీ అశోక్ రెడ్డి తెలిపారు. అనంతరం, అధికారుల బృందం పర్వత్‌నగర్ చౌరస్తా నుంచి ఇరువైపులా ఉన్న రెండు మ్యాన్ హోళ్ల నుంచి మురుగు పొంగడం, ప్రతి రోజు ఒక ఎయిర్ టెక్ మిషన్ అవసరం పడుతుందని గుర్తించి శాశ్వత పరిష్కారంగా పర్వత్‌నగర్ సిగ్నల్ నుంచి రోడ్ నం.45 వరకు కొత్త సీవరేజ్ పైపు లైన్ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు.

చంపింది భర్త కాదు...స్నేహితుడు

కేసును ఛేదించిన పోలీసులు.. నిందితుడు అరెస్ట్

సిటీబ్యూరో, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): నగరంలో సంచలనం సృష్టించిన స్పందన హత్య కేసు మిస్టరీని ఎట్టకేలకు మియాపూర్ పోలీసులు ఛేదించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు మొదట భర్తను అనుమానించినప్పటికీ దర్యాప్తులో భాగంగా లభించిన సాక్ష్యాధారాలతో అసలు దోషిని గుర్తించి అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. శేరిలింగంపల్లి, మజీద్ బండకు చెందిన మనోజ్‌కుమార్ అలియాస్ బాలు(29), బండి స్పందన, వారణాసి వినయ్ ఈ ముగ్గురూ క్లాస్‌మేట్స్. మనోజ్‌కుమార్ చురుకుగా ఉండే స్పందనపై ఇష్టం పెంచుకున్నాడు. కానీ, 2022లో వారణాసి వినయ్‌తో స్పందనకు వివాహమైంది. దీంతో మనోజ్ తన ప్రేమను మనస్సులోనే దాచుకున్నాడు. మనస్పర్ధలతో ఏర్పడిన కుటుంబ తగాదాల కారణంగా స్పందన తన భర్తతో దూరంగా ఉంటోంది. భార్యాభర్తలిద్దరూ విడాకుల కోసం కోర్టును ఆశ్రయించారు. వీరి విడాకులు పెండింగ్‌లో ఉండటంతో స్పందన తన తల్లితో కలిసి మియాపూర్‌లోని సీబీఆర్ ఎస్టేట్‌లో నివాసం ఉంటోంది. భర్తతో దూరంగా ఉంటున్న స్పందనపై మనోజ్ మరోసారి ప్రేమ పెంచుకున్నాడు. ఇద్దరూ ఒకే కంపెనీలో పనిచేస్తుండటంతో ఈసారి ఎలాగైనా స్పందనను దక్కించుకోవాలని, తన ప్రేమ విషయాన్ని స్పందనకు తెలిపాడు. కానీ, ఆమె మనోజ్ ప్రేమను నిరాకరించింది. ఒక స్నేహితుడిగానే మనోజ్‌తో మెలుగుతోంది. అదే సమయంలో తోటి ఉద్యోగులు, క్లాస్‌మేట్స్‌తో దగ్గరగా మెలుగుతోంది. ఇది నచ్చని మనోజ్ పలు మార్లు స్పందనను వారించాడు. అతడి మాటలను స్పందన లెక్కచేయలేదు. దీంతో స్పందనను ఎలాగైనా మట్టుబెట్టాలని నిర్ణయించుకుని సరైన సమయం కోసం ఎదురుచూశాడు మనోజ్. ఈ క్రమంలోనే గత నెల 30న స్పందన ఇంట్లో ఒంటరిగా ఉండటాన్ని మనోజ్ గమనించాడు. స్పందన ఇంట్లోకి చొరబడి ఆమె ముఖంపై గ్రానైట్ రాయితో మోది, స్క్రూడ్రైవర్‌తో పొడిచి విచక్షణా రహితంగా హత్యచేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ ఫుటేజీ, సెల్‌ఫోన్ టవర్ లొకేషన్ తదితర ఆధారాలతో మనోజ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా స్పందనను హత్యచేసినట్లు అంగీకరించాడు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

కేరళ మహం మాంత్రికుడు

★కేరళ మహం మంత్రికుడు స్త్రీ పురుష వశీకరణ స్పెషలిస్ట్ పండిత్ విశ్వరాజ్: భార్యాభర్తల కలహాలు, శత్రు నాశనం, ప్రేమ సమస్యలు & మీ ఎటువంటి సమస్యలైనా 5 గంటల్లో 100% పరిష్కారం. ఫోన్‌లో పరిష్కారం చేయగలరు. 8121931984. NT-334815

PEST CONTROL

★ARG పెస్ట్ కంట్రోల్, సర్వీస్, చెదలు 2BHK 2,000/-, 3BHK 2,500/-, బొద్దింకలు జెల్ 599/- చీమలు, ఎలుకలు, నల్లులు, బల్లులు, న్యూ కన్‌స్ట్రక్షన్ 10 yrs. వారెంటీ. Ph: 9912808736. NT-332645

GOLD FINANCE

★మీ బంగారం బ్యాంకుల్లోగానీ, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. Ph: 9100329739. NT-335055

INSURANCE

★Become an Life Insurance Advisor with TATA-AIA. Work from anywhere 100% Digitally. Unlimited Income, Growth & International Trips Every Month. Part Time / Full Time. Call / WhatsApp: 9505931826. NT-338861

DASARA OFFER

★Invest 15 Lakhs and get Monthly Income 10,000/- for more details Contact: Dr. Financial Consultants. 8106826332, 9391665516. NT-333073

TOURS & TRAVELS

★మహాదేవ టూర్స్: 12/10 సోమనాథ్ + 3 జ్యోతిర్లింగాలు 8 క్షే; 06/11 కార్తీకంలో కాశీ యాత్ర 9 నిద్రలు; 25/11 రామేశ్వరం యాత్ర 25 క్షే; 16/11 కామాఖ్య యాత్ర 7 క్షే; 10/12 సిమ్లా, మనాలి + నవదేవీలు @ 9908844377. NT-336721

OLD AGE HOME

★వృద్ధులు, NRI's విలాసవంతమైన గదులు, లిఫ్ట్, మేడిపల్లి. దీర్ఘకాలిక మంచాన ఉన్న వారికి 24/7 మెడికల్ సర్వీసెస్, ఉప్పల్ & ECIL - కీసర రోడ్, చీర్యాల్ 'X' రోడ్, భోజన వసతితో. సంప్ర: 7981467036, 9391039990, 8074327715. NT-334825

PLOT FOR SALE

★నాగార్జునసాగర్ హైవే యాదాద్రి టౌన్‌లో గజం: రూ. 8,990/- DTCP అప్రూవల్ లేఔట్‌లో & కడ్తాల్ మైసిగండి దగ్గర గజం: 9,990/-. స్టాంప్ రిజిస్ట్రేషన్, 25% పేమెంట్ చేసిన వారికి 5 గ్రా॥ గోల్డ్ ఫ్రీ. Ph: 9014297729, 8919631310. NT-338776

PLOT FOR SALE

★శరవేగంగా అభివృద్ధి చెందుతున్న వరంగల్ హైవే బీబీనగర్ టౌన్, AIIMSకు అతి సమీపంలో, HMDA & RERA అప్రూవ్డ్ ఓపెన్ ప్లాట్లు కలవు. గే॥క॥, ఆల్ డె॥, స్టాట్ రిజి॥, బ్యాంక్ లోన్, ఫ్రీ సైట్ విజిట్. Ph: 9912357546. NT-336726

★దసరా స్పెషల్ ఆఫర్... శ్రీశైలం మెయిన్ రోడ్‌లో కందుకూర్ టౌన్‌లో HMDA ప్లాట్లు, గేటెడ్ కమ్యూనిటీ, పోచారం దగ్గర HMDA ఓపెన్ ప్లాట్లు, ఆలేరు మెయిన్ రోడ్‌లో వీకెండ్ హోమ్స్ ప్లాట్లు కలవు. 7095344396. NT-335076

FLAT FOR SALE

★కమర్షియల్ 2BHK, 1129 Sft., వెంకటాద్రి థియేటర్ బ్యాక్ సైడ్, దిల్‌సుఖ్‌నగర్, JNTU నిజాంపేట్ రోడ్‌లో హైటెన్షన్ రోడ్ 2BHK, 1015 Sft., W/F & చైతన్యపురి ఫణిగిరి కాలనీ 2BHK, 980 Sft. Ph: 9550615070. NT-338769

HOUSE FOR SALE

★Yapral Near Durgamma Temple, Independent House, North Face, G+1, 135 Sq.yds., Fully Furnished, Negotiable. Cont: 9849606836, 9100278027. NT-334808

WANTED

★ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలో Sales & Door to Door మార్కెటింగ్ చేయడానికి Males & Females కావలెను. Quali: Inter, Degree. మంచి Salary + కమీషన్. Office: Uppal. 8341205679. NT-336719